క్లుప్తంగా

గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ కృషి ఆదర్శనీయం

కోదాడఅర్బన్ : వయోజనుల విద్య కోసం గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ చేసిన కృషి ఆదర్శనీయమని కోదాడ శాఖా గ్రంథాలయ చైర్మన్ ఎస్‌కె రహీం అన్నారు. ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా శనివారం కోదాడలోని శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోదాడకు చెందిన జారా ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను ఆ సంస్థ కోఆర్డినేటర్ షేక్ జాహీర్‌తో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సభ్యులు బత్తుల ఉపేందర్, నర్సింహారావు, శేఖర్, ఆరీఫ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో నేడు భగవద్గీత ప్రవచనం

హుజూర్‌నగర్ : పట్టణంలోని రామాలయంలో ఆదివారం సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, భగవద్గీత ప్రచారకుడు రాధా కన్నయ దాస్ ప్రభుజీ భగవద్గీత ప్రవచనం, ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల సందేహాలకు ప్రభుజీ సమాధానాలు ఇస్తారని తెలిపారు. కార్యక్రమానికి భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హుజూర్‌నగర్ : పట్టణంలోని టౌన్ హాల్‌లో శనివారం హుజూర్‌నగర్ టెంట్ హౌస్ ఓనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సాయిరాం, కోశాధికారులుగా కేవీ.చలపతి రావు, ఎస్‌కె.జానీ, ఉపాధ్యక్షుడిగా దస్తగిరి సహాయ కార్యదర్శిగా మోహన్, కమిటీ సభ్యులుగా ఏడుగురిని ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఉన్న టెంట్ ధరలకు అదనంగా 10 శాతం ధరలు పెంచుతున్నట్లు తెలిపారు.

గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి గాను ఇటీవల ఎన్నికైన పేరెంట్స్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం శనివారం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి, నూతన కమిటీ చైర్మన్ జి.మరియమ్మ, వైస్ చైర్మన్ కె.ఉపేందర్, సభ్యులు, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ రేణుక, ఏ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్, డీఈసీ మాత్రల పంపిణీ

నడిగూడెం : ప్రతిఒక్కరూ బోధకాలు వ్యాధి నివారణ మాత్రలను వేసుకోవాలని నడిగూడెం సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆల్బెండజోల్, డీఈసీ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుండు శ్రీను, ఉప సర్పంచ్ నసీమా, వైద్యాధికారి హరినాథ్, వైద్యసిబ్బంది కళావతి, విజయకుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శేషిరెడ్డికి నివాళి



శేషిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, తదితరులు

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన విప్పల శేషిరెడ్డి (30) ఇటీవల మృతి చెందారు. శనివారం ఆయన దశదిన కర్మ కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు పాల్గొని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు వనపర్తి లక్ష్మీనారాయణ, గుండపునేని నాగేశ్వరరావు, కోటయ్య, కొండల్‌రావు, సైదులు, బాబు ఉన్నారు.

27న బోనాల పండుగ



ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోదాడఅర్బన్ : కోదాడలో ఈ నెల 27న (ఆదివారం) ముత్యాలమ్మ (బోనాల) పండుగ నిర్వహించనున్నట్లు ముత్యాలమ్మ దేవాలయ కమిటీ, రైతు కమిటీ, పట్టణ పెద్దలు తెలిపారు. శనివారం కోదాడలోని ముత్యాలమ్మ దేవాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు వట్టివేళ్ల రవీందర్‌రెడ్డి, సభ్యులు సైదయ్య, గంధం పాండు, వేముల రామయ్య, కోట వెంకటేశ్వరరావు, చిన్న వెంకయ్య, రామారావు, మురళి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. బీటీ మరిచారు



కంకర పరిచి వదిలేసిన నారాయణపురం రహదారి

నడిగూడెం : మండల పరిధిలోని నారాయణపురం క్రాస్ రోడ్డు నుంచి నారాయణపురం గ్రామంలోకి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. గతంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా చెన్నకేశ్వాపురం నుంచి కరివిరాల, నారాయణపురం, సిరిపురం గ్రామాల మీదుగా వల్లాపురం వరకు బీటీ రహదారి నిర్మించారు. కానీ నారాయణపురం క్రాస్ రోడ్డు నుంచి నారాయణపురం గ్రామంలోకి దాదాపు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రెండున్నర సంవత్సరాల క్రితం కంకర పరిచారు కానీ బీటీ వేయడం మరిచారు. దీంతో ఆ రహదారి గుంతలమయంగా మారింది. కంకర తేలి ప్రమాదకరంగా తయారైంది. ఈ రహదారి మీదుగా నిత్యం నారాయణపురం, సిరిపురం, వల్లాపురం గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. రహదారి అధ్వానంగా మారడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రహదారిని పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణించేదెలా..



అసంపూర్తిగా ఆకుపాముల- తెల్లబెల్లి రహదారి

మునగాల : మండల పరిధిలోని ఆకుపాముల గ్రామం నుంచి కోదండరామాపురం గ్రామం మీదుగా నడిగూడెం మండలంలోని తెల్లబల్లి, రత్నవరం గ్రామం వరకు గల ఆర్అండ్‌బీ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మే నెల మొదటి వారంలో ఈ రహదారి పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ రహదారిపై ఉన్న తారు రోడ్డును తొలగించి కంకర పరిచి వదిలి వేశాడు. నాలుగు నెలలైన రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు తిప్పలు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై కంకర తేలడంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని వారు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారి పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేయాలని కోదండరామాపురం గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

మృతుల కుటుంబాలకు పద్మావతి పరామర్శ

నడిగూడెం : మండలంలోని రత్నవరం గ్రామానికి చెందిన కాసాని కాశయ్యగౌడ్ (45) ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన కందాళ బుచ్చిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుల కుటుంబాలను శనివారం కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట సర్పంచ్ పగడాల పద్మ, మాజీ సర్పంచ్‌లు విజయ్‌వర్ధన్‌రెడ్డి, వినయ్‌వర్ధన్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



రత్నవరంలో కాశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

అనాథ మహిళను ఆశ్రమానికి తరలింపు



అనాథ మహిళను అనాథాశ్రమానికి తరలిస్తున్న ఎస్ఐ పరమేష్, సేవా భారతి సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్లలో కోదాడ- జడ్చర్ల ప్రధాన రహదారి మధ్యలో డివైడర్‌పై గత రెండు రోజులుగా ఉంటున్న మతి స్థిమితం లేని మహిళను శనివారం నేరేడుచర్ల పోలీసులు, ఆర్ఎస్ఎస్ సేవా భారతి సభ్యులు సంయుక్తంగా సూర్యాపేట సమీపంలోని దురాజ్‌పల్లిలో గల అన్నపూర్ణ అనాథ ఆశ్రమానికి తరలించారు. గత నెలలో రోడ్డుపై దీనస్థితిలో ఉన్న ఈ మహిళను ఆర్ఎస్ఎస్ సేవా భారతి సభ్యులు దురాజ్‌పల్లిలోని అన్నపూర్ణ అనాథ ఆశ్రమంలో చేర్పించగా ఆమె అక్కడి నుంచి తప్పించుకొని తిరిగి నేరేడుచర్లకు చేరుకుంది. దీంతో పలువురు సేవా భారతి సభ్యులకు సమాచారం అందించారు. వారు ఎస్ఐ పరమేష్‌కు సమాచారం అందించి వివేకానంద సేవా భారతి ఆస్పత్రి ఇన్‌చార్జ్ కేశగాని రవి ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో అనాథ ఆశ్రమానికి చేర్చారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సేవా భారతి సభ్యులు మెట్టు వేణుగోపాల్‌రెడ్డి, వీరయ్య, బాల వెంకటేశ్వర్లు, సైదిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీను, కోటేశ్వర్‌రావు, నటరాజ్, అనిల్, సైదులు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పాదయాత్ర



దొరకుంటలో పాదయాత్ర చేస్తున్న సాముల జైపాల్‌రెడ్డి

కోదాడరూరల్ : సమాజ శ్రేయస్సు, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పాదయాత్ర చేస్తున్నానని సాముల జైపాల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ సాముల జైపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని చిమిర్యాల, దొరకుంట గ్రామాల్లో ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో స్థిరపడి పారిశ్రామికవేత్తగా ఎదిగిన తాను ఈ ప్రాంత ప్రజలకు సహాయం చేసేందుకు ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని తెలిపారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో పేద ప్రజలకు విద్య, వైద్యంతో పాటు పలు రకాలు సేవ చేస్తూ ముందుకు వెళ్తున్నానన్నారు. పాదయాత్రలో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కోదాడ మండలంలో ఈ నెల 16 వరకు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఆయన వెంట కొప్పుల కోటిరెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్

మునగాల : గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెనుయేలు వర్షిప్ సెంటర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జె.జె.సామ్యూల్ కోరారు. శనివారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో తమ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో ఆరోగ్యశ్రీ ఆసుపత్రి ప్రముఖ వైద్యుడు శశిసుందర్ ఆధ్వర్యంలో సీనియర్ ఆర్ఎంపీ వైద్యుల సహకారంతో 215 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెనుయేలు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జి.ప్రభాకర్, ఎం.రాజేష్, జె.ప్రవీణ్, ఇ.ఉదయ్, ఎల్.లాజర్, జి.ఓబద్యా, కె.రాజు, తబిత, వనజ, రాణి, సుగుణమ్మ, దానియేలు, సీనియర్ ఆర్ఎంపీ వైద్యులు ఏ.బిక్షపతి, పి.పృథ్వీ, సైదిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ

పాలకవీడు : మండలంలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల స్వీకరణ ముగిసినట్లు తహసీల్దార్ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 1602 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఎస్సీలు 320, బీసీ 472, ఎస్టీ 677, మైనారిటీ 15, ఇతరులు 117, దివ్యాంగులు ఒకరు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులకు సంబంధించి గ్రామ పంచాయతీల్లో వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అనంతరం పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

1827 దరఖాస్తులు

మునగాల : మండల వ్యాప్తంగా గృహలక్ష్మి పథకానికి 1827 దరఖాస్తులు అందాయని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాధారెడ్డి శనివారం తెలిపారు. కమ్యూనిటీ పరంగా ఎస్సీ వర్గాల నుంచి 577, ఎస్టీ 187, బీసీ 765, మైనార్టీ 49, ఇతరులు 234, దివ్యాంగుల నుంచి 15 దరఖాస్తులు అందాయన్నారు.

2194 దరఖాస్తులు

నడిగూడెం : మండలంలో గృహలక్ష్మి పథకానికి 2194 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ టి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులను తీసుకున్నట్లు తెలిపారు.

పాపన్న జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి



చిలుకూరు : పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



పానుగోడులో సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గరిడేపల్లి : సూర్యాపేటలోని పబ్లిక్ క్లబ్ హాల్‌లో ఈనెల 18న నిర్వహించబోయే సర్దార్ సర్వాయి పాపన్న 373వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు కోరారు. శనివారం మండలంలోని పానుగోడులో అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్రకు స్వాగతం పలికి అనంతరం సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మండవ సైదులు, నాయకులు జెర్రిపోతుల కృష్ణ, కాశయ్య, పరశురాములు, సైదులు, నాగయ్య, నారాయణ, రాములు, వెంకటయ్య, వెంకన్న, పద్మ, వెంకటప్పయ్య తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చిలుకూరు : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం (నేడు) నిర్వహించబోయే శ్రీశ్రీ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని జైగౌడ్ సంఘం నాయకులు కోరారు. శనివారం మండలంలోని బేతవోలులో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జైగౌడ్ సంఘం జిల్లా, మండల నాయకులు మండవ సైదులు, బత్తిని రాములుగౌడ్, బెల్లంకొండ వీరయ్యగౌడ్, బెల్లంకొండ లక్ష్మయ్య, బాబుగౌడ్, అంజిబాబు, కాశిగౌడ్, రాములుగౌడ్, కొండా కోటయ్య, వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధితో ప్రజలకు ఉపాధి

సూర్యాపేట : ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధితో లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఎస్ ఫౌండేషన్ చైర్మన్ గుంటకండ్ల సునీతజగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని 22, 36వ వార్డుల్లో మహిళలకు కోలాటం చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మెడికల్ కళాశాల, రెండు మినీ ట్యాంక్‌బండ్లు, మహాప్రస్థానంతో అభివృద్ధి సందడి నెలకొందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కిషోర్, బీఆర్ఎస్ నాయకులు ప్రకాష్, కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



హుజూర్‌నగర్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు, రెండవ ఏఎన్ఎంలు



నేరేడుచర్లలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, రెండవ ఏఎన్ఎంలు



కోదాడఅర్బన్ : అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న రెండో ఏఎన్ఎంలు

హుజూర్‌నగర్ : ప్రభుత్వం రెండవ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ అన్నారు. రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం హుజూర్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి అందరిని రెగ్యులరైజ్ చేస్తానని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నేడు గాలికి వదిలేశారన్నారు. కాగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ వీరికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇందిరాల వెంకటేశ్వర్లు రెండవ ఏఎన్ఎంలు జి.అలివేలు, ఆర్.మాధవి, కె.కవిత, ఎం.విజయ, ఆర్.అరుణ, జి.స్వరూప, రాణి, పి.ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసే రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. శనివారం నేరేడుచర్లలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రెండవ ఏఎన్ఎంలతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గత 16 ఏళ్లుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు సేవలను అందిస్తున్న రెండవ ఏఎన్ఎంల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చికలరాజు శ్రీను, మధార్, రెండవ ఏఎన్ఎంలు మమత, రేణుక, నాగేంద్రమ్మ, నాగమణి, శ్యామలకుమారి తదితరులు ఉన్నారు.

కోదాడఅర్బన్: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ రెండో ఏఎన్ఎంల సంఘం ఆధ్వర్యంలో శనివారం కోదాడలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెండో ఏఎన్ఎంల రాష్ట్ర నాయకులు టి.గోపయ్య, బి.రాధకుమారి, సి.శైలజ, సీహెచ్.రూప మాట్లాడారు. తమను రెగ్యులరైజ్ చేయాలని కోరితే ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు నీరజ, రూపారాణి, పద్మ, చంద్రకళ, తీత, వీరలక్ష్మి, సుగుణ, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో బహుళ ఏకాదశి పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో బహుళ ఏకాదశి మృగశిర నక్షత్ర పూజా కార్యక్రమాలను శనివారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఫల పుష్పార్చన, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సేవాకాలం, అలంకరణ, మంగళాశాసనం, తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ధర్మకర్తలు సురభి కుషల్, పూర్ణ, సైదులు, నర్సింహారావు, వెంకటనారాయణ, కార్యనిర్వాహణాధికారి ఎంపి లక్ష్మణరావు, తల్లాడ వెంకటేశ్వరరావు- సావిత్రి, అర్చకుడు హరీష్‌కుమార్‌చార్యులు, కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో మత్స్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని తెలంగాణ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీలం శ్రీను డిమాండ్ చేశారు. శనివారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సంబంధిత కమిషనర్‌ను పలుమార్లు విన్నవించామని అయినా ఫలితం లేకపోవడంతో ఈనెల 25 నుంచి రాష్ట్ర వ్యాప్త నిరసనలు, ఆందోళనకు పూనుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మత్స్య శాఖ అవసరాలకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్యను పెంచాలని కోరారు. ప్రతి జిల్లాలో నీటి ప్రాజెక్టుల పక్కన ప్రభుత్వం చేప, రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలను నిర్మించాలన్నారు.

బీఎస్పీ నాయకుల అరెస్టు



అరెస్టయిన బీఎస్పీ నాయకులు

నేరేడుచర్ల : బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని గద్దెదించుతామని బీఎస్పీ జిల్లా కన్వీనర్ రాపోలు నవీన్ అన్నారు. గ్రూప్- 2 పరీక్షను వాయిదా వేయాలని బీఎస్పీ రాష్ట్ర కమిటీ మేరకు హైదరాబాద్‌కు తరలివెళ్తున్న బీఎస్పీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయన వెంట బీఎస్పీ నాయకులు కొండమీది నర్సింహారావు, ఉపేందర్, రామస్వామి, సతీష్‌రెడ్డి, మట్టపల్లి, నాగార్జున తదితరులు ఉన్నారు.

17న సూర్యాపేటలో జిల్లా సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపూరి రాజు

మునగాల : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు పార్లమెంటు ద్వారా చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు చివరి వారంలో హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయడానికి ఈనెల 17న సూర్యాపేటలో నిర్వహించబోయే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఎంఎస్పీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి రాజు మాదిగ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్ లంజేపల్లి శ్రీను మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో మాదిగ, మాదిగ ఉప కులాల యువత, విద్యార్థులు, మహిళలు, మాదిగపెద్దలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు లంజేపల్లి అంజి, కిన్నెర రాజు, రవి, నవీన్ పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత అలవర్చుకోవాలి



విద్యార్థులచే స్కాట్ చేయిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

మఠంపల్లి : పాఠశాల దశలోనే విద్యార్థులు సామాజిక బాధ్యతను అలవర్చుకోవడానికి నాయకత్వ లక్షణాలు దోహదపడతాయని స్థానిక సెయింటాన్స్ ప్రిన్సిపాల్ సిస్టర్ సుజాత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సెయింటాన్స్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్కూల్ పీపుల్స్ లీడర్స్, స్పోర్ట్స్ లీడర్స్, హౌస్ లీడర్స్‌గా ఎన్నికై ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులచే స్కాట్ చేయించి గౌరవవందనం స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో శుభోదయ యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి, సిస్టర్ రూబిన్, మార్గరేటా, శుభశ్రీ, పీఈటీ తరుణ్‌రెడ్డి, లీడర్స్ తల్లిదండ్రులు అనిత, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీను, నరసింహారావు, స్వర్ణ, రవళి, మహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

తుంగతుర్తి : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు వడ్డెపల్లి రవి అన్నారు. ఈ నెల 14న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించి మట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో అర్థం కాకుండా ఉందని, రుద్రమ్మ చెరువును రిజర్వాయర్ చేస్తామని ఇంతవరకు చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజ్జ నరేందర్, రమేష్, జాని, తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవనం.. ప్రారంభానికి సిద్ధం


- రూ.20 లక్షలతో నిర్మాణం
- నాలుగు నెలల్లోనే పనులు పూర్తి
- త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు



అల్వాలపురంలోని నూతన పంచాయతీ భవనం

కోదాడరూరల్ : మండల పరిధిలో అల్వాలపురంలో నిర్మించిన నూతన పంచాయతీ కార్యాలయం పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. అల్వాలపురం గ్రామం గత పంచాయతీ ఎన్నికలకు ముందు నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటైంది. ఎన్నికల్లో సర్పంచ్‌తో పాటు పాలకవర్గం కొలువు తీరింది. పంచాయతీ ఏర్పాటు తర్వాత కార్యాలయ భవనం లేకపోవడంతో గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. దీంతో అల్వాలపురంలోని వెంచర్‌లో గల ప్రభుత్వ భూమిలో రూ.20 లక్షల ఉపాధి హామీ నిధులతో నాలుగు నెలల కిందట ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ చేతుల మీదుగా భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అధికారులు వేగవంతంగా పనులు చేయించడంతో ప్రస్తుతం భవన నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధం అయింది. ఈ భవనం ప్రారంభంతో తమకు సమస్యలు తప్పనున్నాయని స్థానికులతో పాటు పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి అంటున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం



అల్వాలపురం నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతో నాలుగు నెలల్లో పనులు పూర్తి చేశారు. త్వరలోనే భవనాన్ని ప్రారంభించి అందుబాటులోకి తెస్తాం.

– రాము, పీఆర్ ఏఈ, కోదాడ